నేను రోడ్డు దిగేటప్పటికి సూర్యుడూ దిగిపోయినాడు. పొలాల దారి వెంట నడుస్తున్నాను. విశాలమైన పైరు లేని సేద్యం చేసిన పొలాలూ, సూర్యకాంతి లేని వెలుగూ ఆత్మీయంగా ఉన్నట్లున్నాయి. నీలం రంగు ఆకాశం కింద, నిశ్చలంగా పడుకున్నట్లున్న సముద్రాన్ని దూరం నించీ చూస్తున్నట్లుగా ఉంది. కాళ్ళ కింద బళ్ళ జాడలు ఏర్పరిచిన గోతులు, ఎండి పెళ్ళలుగా మారి చెప్పు తెగిన పాదాల్ని నొప్పిస్తున్నాయి. నాలుగు

ఈ వేళ పట్టణంలో చెప్పులు కొనుక్కోవాలనే ధార్మికులకు గాక పైగా పది రూపాయలు జేబులో వేసుకున్నాను. కానీ, పది రూపాయలకు చెప్పులు కొనుక్కునే పరిస్థితినించీ దేశం ఎంత అభివృద్ధి సాధించిందో తెలిసిందిప్పుడు. నాడిప్పుడు కాళ్ళకు వేసుకుని, నాడప్పుడు నెత్తిన పెట్టుకుని అపురూపంగా చూసుకుంటే,



రోజుల కిందట పెద్ద వర్షం కురిసింది. తేమ ఆరక ముందే రైతులు పొలాలకు ఎరువూ, మట్టీ తోలుకున్నారు. వాళ్ళ ఆత్రం వాళ్ళది. వెనకబడకుండా ఎరువు తోలి, సేద్యం చేసుకుంటే ఈ సారి కురిసే వర్షానికి విత్తనాలు వేసుకోవచ్చును. ఒక్క వర్షం వృథా అయితే ఎంత నష్టమో అది మెట్ట రైతుకే తెలుసును.

ఆరునెలలు బతికే చెప్పులు పాతిక్కి పైసా తక్కువ లేదు. పాతిక పెట్టాలంటే (లేదు, సరే అనుకుంటేనే!) చర్మం సలిచి చెప్పులు కుట్టించుకుంటే 'ఛీప్' కదా! అనిపిస్తున్నాయి.

ఎక్కడో ఉరిమిన శబ్దం నా ఆలోచన నించి కదిలించింది. ఈ వేళ పగలు విపరీతమైన ఉక్క పోసింది. ఇప్పుడెక్కడో ఉరిమింది. (అది ఉరుమేనా? ఏదన్నా శబ్దమా?) ఇంకా రెండు మైళ్ళ పైనే నడక. దారిలో వర్షమొస్తే! గొడుగన్నా లేదు. గొడుగు కొనాలి, తప్పదు, గొడుగు కొనాలి అనే ఆశయం కూడా కొన్నేళ్ళుగా ఉంది నాకు. ఆ ఆశయం పుట్టినప్పుడు ఏడెనిమిది రూపాయల్లో సాధించుకోవడానికి వీలుగా ఉండేది. అంతకు మూడింతలకుకూడా అసాధ్యమైన ఆశయంగా ఉందిప్పుడు.

ఆశయాలట్లా పైపైకి పెరుగుతూ పోనీ! ఆశయాల్ని సాధించుకో కూడదు. అవసరాల్ని సాధించుకోవడం అవసరం. వర్షమొస్తే గొడుగు అవసరం కదా. నిజమే, కేరుకు అయిదు రూపాయలు పెట్టి ప్రతి రోజూ బియ్యం కొనడం ఇప్పుడత్యంత అవసరం.

ఈ సారి స్పష్టంగా ఉత్తరం దిక్కున పుట్టిన ఉరుము, తూరుపున సరిగ్గా పొట్ట పొడిచే ప్రళయ ప్రతిధ్వనించింది. ఇంతవరకూ కనిపించని మేఘం ఆకాశం అంచునించి పైకి లేస్తూంది. బాటలో నాలుగు బారలు ముందు ఏముందో కళ్ళు కనిపెట్ట లేకపోతున్నాయి. ఉరుము అనే పిడికిలి దెబ్బ తిని, మేఘం తల బద్దలైనట్లు, మెరుపు చిల్లుకుని పోయింది. అప్పుడే నిద్రనుండి మేల్కొన్న పాప నవ్వులా, చల్లగాలి తాకుతూంది. వర్షం వస్తూంది, భయం! వర్షం వచ్చే లోపున ఇల్లు చేరుకోవడ మొక్కటే ఇప్పు డన్నిట్నీ మించిన ఆశయం. వడిగా అడుగు లేస్తున్నాను. ఇంతకుముందు కంటే, ఇప్పు డెక్కువగా పాదాలు దెబ్బ తింటున్నాయి గుడ్డిగా. అయినా, నొప్పిగా ప్రత్యేకించి ఫిర్యాదు చేసుకోవడం లేదు. పరిస్థితి గుర్తించి, సహకరిస్తున్నాయి.

నా తోటి టీచర్ని జిల్లా చిట్టచివర్న, గుట్టల నడుమ కట్టిన ఒక స్కూల్లోకి గిరవాటేశారు జిల్లా విద్యాశాఖాధికారి. ఆయన భార్య నిండుమనిషి. తల్లి గుడ్డి మనిషి; తండ్రి జబ్బుమనిషి! నేను పనిచేస్తున్న ఊరు అతని సొంత ఊరు. అక్కడ కట్టుకుంటున్న కొంప, ఇప్పుడు అర్ధాంతరంగా ఉంది. జిల్లా విద్యాశాఖాధికారి యువకుడు; మా తమ్ముడికి క్లాస్ మేట్. ఈ సంబంధం నా కో-టీచరుకు తెలుసు. ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేయించమని తగులుకున్నాడు. ఆయన కుటుంబ స్థితి చూసి అంగీకరించవలసి వచ్చింది. అటు మా తమ్ముడి నించి, డి. ఇ. ఒ. గారికి ఉత్తర మొచ్చిన తరవాత, ఆ సంగతి వాడే తెలియజేసిన తరవాత ఈయన్ను తోడ్కొని సమ్ముఖాన విన్నవించుకోవడానికి వెళ్ళినాను. కాన్సిల్ అయినట్లు త్వరలో తెలుస్తుందని పొమ్మన్నారు డి. ఇ. ఒ. గారు. కృతజ్ఞత చెప్పి, బస్సెక్కడానికి బయలుదేరాము. నేను ఎక్కి కూర్చున్నాక చూస్తే అతను కింద నిలుచునే ఉన్నాడు. రావా? అన్నట్లు చూస్తే, రాత్రికి ఉండి సినిమా చూసొస్తానని నసిగాడు. సమస్య తీరిపోయింది, ఇంక సరదా తీర్చుకుంటాడన్న మాట. ఇంటి దగ్గర అంత బాధ్యత ఉంచుకుని ఈ మనిషి సినిమా కోసం ఎట్లా ఆగుతున్నాడు? బాధ్యతలతో ప్రతి క్షణమూ నలిగిపోతున్నట్లు చెప్పుకున్నాడే మరి? పోనీ, నే నేం కష్టపడ్డాను గనక? ఇంత మాత్రంతో అతనికి మేలు జరిగేటట్లయితే (ముఖ్యంగా అతని వాళ్ళకు) నేనూ సంతోషించవచ్చు గదా?— నా ఆలోచన ఏమిటనుకున్నాడో, 'నువ్వూ



ఉత్తమం ఉన్నతాసనం

ఫోటో—బి. వి. రెడ్డి (హైదరాబాదు)

ఉండరాదూ? పొద్దున్నపోదాం. ఆదివారమేగా' అన్నాడు. 'కాదులే. నేను వెళతాను' అన్నాను. కర్ర పట్టుకుని, బస్సులో తల దూర్చి, నా జేబులో రెండు చిన్న కాగితాలు దూర్చాడు. ఇదేమిటంటే, 'ఇహిహి' అన్నాడు. తీసేయమని తీవ్రంగా అనేప్పటికి, తిక్కమనిషా? ఇంకా కావాలంటాడా? అన్నట్లు చూస్తుండి పోయాడు.


ఇవన్నీ తలుచుకుంటూ నడుస్తున్నాను. చీకటి చిక్కబడింది. దూరాన వర్షం కురుస్తూన్నట్లు తేమగాలి తాకుతూంది. ఇట్లా పొలాల్లో, రాత్రిళ్ళు నడవడం నాకు మంచి అనుభవంగా ఉంటుంది. కావాలనే, ఈ ఆఖరి బస్సులో వస్తాను. అయితే, ఇప్పుడు మాత్రం, ఇంతకు ముందున్నట్లు కాకుండా కొత్తగా ఉంది. ఏదో అస్థిమితంగా, సంచలనంగా ఉంది. ఎందుకు? వర్షం వస్తుందనా? ఎక్కడో పొలంలో కప్ప గొంతు నరాలు తెగిపోతాయన్నంత 'హైట్'గా, పళ్ళు నూరినట్లు, ఓగించిన తంత్రుల మీద మీటినట్లు గోణుక్కుంది. దానికీ ఏదో సంచలనం ఉందా? దారిలోకి సాగిన ఏదో చెట్టుకొమ్మన కూర్చున్న ఏదో పిట్ట బుర్రున ఎగిరింది. దాని రెక్కలతోబాటు అయుగా, నా గుండె టపటప కొట్టుకుంది. పిట్ట ఎగిరితే జెదిరిపోయే స్థితిలోనే ఉన్నానా? గాలి ఎక్కువగా వీస్తూంది. నా బట్టలమీద, తలమీద టుమ్ము నిండుకుంటూంది. ఈ సారి పెద్ద మెరుపు. ఫర్లాంగు దూరంలో ఉన్న చెంగమ్మ బావి పక్కన చింతచెట్టు ఊగుతూండటం కనిపించింది. నాలో ఇందాకా ఉన్న అర్థంకాని సంచలనానికి

## 'తులసీకృష్ణ'

కారణం, అర్థం ఇప్పుడు తెలిసినట్లయింది. ఈ చింతచెట్టు నివాసించే ఇటీవల బుజ్జమ్మ పడి చనిపోయింది. 'మా అబ్బిగాడికి పెద్దగా సదువు సెప్పు, సామీ, నా కరెతి వాడికి ఇప్పుడేటౌను' అంటున్న బుజ్జమ్మ కనిపిస్తూంది నాకు.

నేను టీచర్‌గా ఈ ఊరు వచ్చి ఫస్ట్ ఫారమ్‌తో, ఆ సెక్షన్‌తోటి అడుగు పెడుతూనే కనిపించింది బుజ్జమ్మ కొడుకు. వాణ్ణి చూసి కొయ్యబారి పోయాను. అదేం పిడాకారం? వాని తలకాయ వాని శరీరానికి మించిన సైజులో ముడిమొద్దు లాగా ఉంది. అసలు వాని శరీరం పెరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే, ఆ తల లాంటి భారం పెట్టినట్లుగా ఉంది. ఆ తలకూడా గుండ్రంగా లేదు. వెంట్రుకల్లేవు. మాను తొలి, పదరం చేసిన పుడికయ్య లాగా ఉంది. అవునంటే—పుడికయ్య లాగే. అందులో ఉండే బురదకు బదులు, ఇక్కడ జిడ్డు కారుతూ ఆముదముంటుంది. విశాల ధవళాక్షుడు వాడు. అవీ వికారమే ఇచ్చాయి వాడికి. గుండీలు లేని ఆ చొక్కా కింద రొమ్ము కనిపిస్తూంది. అది పిల్లవాడి రొమ్ము కాదు. దెబ్బతిని, నొక్కుపడిన డొక్కు, సత్తు డబ్బా లాగా ఉంది. వాడిని చూడటం కష్టంగా ఉంది. చూస్తే, చూపు మరల్చుకోవడమూ కష్టంగా ఉంది. పిల్లల హాజరు వేస్తున్నప్పుడు, 'వాని పేరు ఏమయి ఉంటుందా' అని ఆలోచిస్తున్నాను. పేరు పాపయ్య. గొల్ల పాపయ్య. కులం పేరే ఇంటి పేరయింది. పాఠం చెపుతున్నాను. (పాఠమేమిటో జ్ఞప్తికి రాలేదు.) వాని మీద అతుక్కోబోయే చూపుల్ని లాక్కుని ఆ మూలకు, ఈ మూలకు, క్లాసురూమ్ వాకిలి వైపూ విసరేస్తూ... అవునప్పుడే వాకిలి దగ్గర!

ఆమె నెత్తిమీద పేడతో పూసి అలికిన ఒక డబ్బలబుట్ట ఉంది. ఆ తల మీద బుట్టను ఆమె చేత్తో పట్టుకో లేదు. బుట్ట ఆమె తల మీద పుట్టినట్లుగా ఉంది. ఎడమచేతి చూపుడు వేలికి వెన్నలంటి సున్నముంది. కుడి చేతిలో కొన్ని మడిచినతమలపాకులున్నాయి. ఎత్తుగా, బలంగా, ఇనుప అవయవాలతో ఉంది. చీరె మోకాలి దాకా పీకి గోస్ పెట్టుకుంది. ఒక కాలికి ఒక రకం చెప్పు. ఇంకో కాలికి ఇంకో రకం చెప్పు. గొప్ప ఆకారం కలిగిన మగవాడు ఆడ వేషం వేసుకున్నట్లుగా ఉంది. ఎందు కొచ్చినట్లు? ఆమె మాట్లాడలేదు. మాట్లాడకపోవడానికి కారణముంది. నోరు దారుణంగా తాంబూల చర్వణం



ఆనందం
ఫోటో—ఎస్. ప్రసాదరెడ్డి (ఇచ్ఛాపురం)

చేస్తోంది. రావడానికైనా కారణం ఉండద్దా? అప్పటికి రాంబాల సేవని క్రీము ముగిసిందేమో, మిగిలిన ఆకుల్ని దాచుకుంది. ఎక్కడ? ముత్యంలాగా, దిండు లాగా కట్టిన ఆ బొడ్డుమీది చీరె కట్టుమీ రెండు వేళ్లతో కిందికి గుంజి . . అక్కడ! రహస్యమైన చోటు బహిరంగంగా దాచుకుంది. ఎడమచేతి చూపుడు వేలికున్న సున్నం క్లాస్‌రూమ్ తలుపు చెక్కకు రాసింది. ఎట్లా? మిలమిలలాడే పెళ్ళికూతురు అద్దాం చెక్కిలిమీద, దిష్టిచుక్క పెడుతున్నంత సవిలాసంగా. పిల్లల్లో ఇద్దరు ముగ్గురు ఒక్కసారిగా, బిగ్గరగా 'రే రే, తోలుగా! మీ అమ్మ!' అన్నారు. వాడు. . . ఎవరు? ఆ గురుమస్తకుడులేచాడు.

వాడు వస్తున్నప్పుడు కాళ్ళలో ఎముకలు లేనట్లు. ఎక్కడి కక్కడ వంగి పోతాయేమో నన్నట్లు. కేవలం రబ్బరు గొట్టాల్లా ఉన్నాయి. పాదాలు వెడల్పుగా, అరిగిన చెప్పుల్లా ఉన్నాయి. ఇంతకూ వాని శరీరం పైనా, కిందా మిగతా శరీరానికి మించిన ప్రమాణంతో ప్రారంభించబడింది. ఎముకలు అసలే లేనట్లూ, మొత్తం శరీరంలో వెతికితే అక్కడొకటి, ఇక్కడొకటి అందవచ్చునేమో! అనిపిస్తోంది.

ఆమె ప్రశ్నలు వేస్తోంది. వాడు తల ఊపుతున్నాడు.

'సద్ది దాగినావూ?'

'ఊఁ. . .' (తల ఊపు.)

'మజ్జిగ కుముక్కున్నావు?'

'ఊఁ. . .' (తల ఊపు)

'అయిపోయిందా? ఉందా?'

'అహఁ. . .' (తల ఊపు, అడ్డంగా.)

వాడు తినడమూ, చద్ది మిగలడమూనా? అనుకున్నాను. ఇట్లా ప్రశ్నలడుగుతూనే ఎడమ పక్కరొండిలోనించీ ఏదో నాణెం తీసి వాని జేబులో వేసింది. ఆమె నడుం చుట్టూ, చీరెలోనే అర ఏర్పాటు చేసుకుని, ఒక్కో రకం సంపద దాచుకున్నట్లుంది. వాడు తిరిగి క్లాస్‌రూమ్‌లోకి వస్తున్నాడు.

'రే. . . అబ్బిగా!' కేకేసింది. వాడు ఆగాడు అక్కణ్ణే.

'మీ నాయి నొచ్చినాడా?'

'రాలా. . .'

'యాడ వచ్చినడో, నువ్వుపోలోపలికి.'

వెనక్కి తిరిగి, తుపుక్కున ఊసి, అట్లాగే పోతూంది చేతు లూపుకుంటూ. నా కాశ్చర్య మేస్తోంది. ఎంత నిమిత్తమాత్రుణ్ణే మేమ? ఉపాధ్యాయుడనేవాణ్ణి నేనొకడి మండగా, ఆమె రావడ మేమిటి? వచ్చెను బో. . . నన్నడక్కుండా వాణ్ణి పిలుచుకోవడమేమిటి? పిల్చెనుబో. . . పిల్ల వెధనైనా నన్నడకుండా వెళ్ళడమేమిటి? తోడిపిల్లలుకూడా తోలుగాని అమ్మనే గుర్తించినారు గానీ, తోలు బొమ్మలా గా కుర్చీలో కూర్చున్న నన్ను గుర్తించలేదు. క్లాస్‌రూమ్ లోకి అడుగు పెట్టిన తరవాత ఆ పీడాకారం కనపడటం, ఆ తరవాత జరిగిన సంఘటనా నాకు చిరాకు కలిగించాయి. వాణ్ణి లేపి, కేకలేశాను. నన్నడక్కుండా బయటికి వెళ్ళకూడదని మిగతా పిల్లలకు వార్నింగిచ్చాను. ఆ పిల్లవాని ఆకారం చూసి నప్పటినించీ నా మనసులో ఏదో పోలిక మెదులుతూంది. ఎప్పుడో, ఎక్కడో ఇంచుమించు ఇట్లాంటి ఆకారాన్ని చూసి నట్లు అనుభూతి. ఎక్కడ? ఏమిటేది? ఎంత ఆలోచించినా, ఎన్ని జ్ఞాపకాల పొరలు చీల్చి చూసినా అందలేదు. పిల్లలు వాణ్ణి 'తోలుగా!' అని పిలవడంతో దొరికింది. ఇప్పుడు స్పష్టంగా, సమగ్రంగా కనిపిస్తోంది. చాలా ఏళ్ళ క్రితం, నేను పదేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు మా ఇంట్లో ఒక కోడిపెట్ట గుడ్డు పెట్టింది. అది మామూలుగా లేదు. గాలి తీసిన బంతిలాగా ఉంది. ఎటు వేపు వేళ్ళు తాకితే అటువేపు నొక్కులు పడుతూంది. అది తోలుగుడ్డు అన్నారు. అట్లాంటి గుడ్డు పెట్టిన పెట్ట ఇంట్లో ఉంటే ఇంటికి 'చేట్ట' అన్నారు. ఇంట్లో లేకుండా పెట్టను పొట్టలో పెట్టేస్తే చెరుపేం లేదని వాళ్ళే చెప్పగా ఆ పనే చేశాము. అది వేరే సంగతి. అసలు సంగతి ఇది! వాణ్ణి చూస్తే ఆ జ్ఞాపకం నా కెక్కడో లోతుల్లో అందీ అందకుండా సోకిందన్న మాట. ఇప్పుడు పైకి తేలింది. ఆ నాటి మా కోడిపెట్ట లాగా బుజ్జమ్మకూడా తోలుగుడ్డు పెట్టింది. పాపయ్య అనే పేరు వ్యవహారంగానూ, తోలుగాడు అనే పేరు ఉత్పత్తి అర్థంగానూ ఉంది. ఆ రెండు పేర్లనూ సమానంగానే చూస్తున్నట్లుంది బుజ్జమ్మ. ఆ రెండో పేరు వానికికానీ, తనకి కానీ అవమానంగా భావించలేదు. లేకపోతే పిల్లలు ఆమె ముందే ఆ పేరుతో పిలవరు, ఆమె మామూలే నన్నట్లుండదు.

ఆ తరవాత మూడు, నాలుగు రోజులు క్లాస్‌రూమ్ దగ్గరికి రాలేదు. ఇంక రాదేమోలే అనుకున్నాను. నా బ్లైమ్ మారడం వల్లనే గానీ, బుజ్జమ్మ రాకపోవడం కాదని అదే వారంలో, అదే టైమ్‌లో ఉన్నప్పుడు తెలిసింది. అయితే, మొదటి ధోరణి మారింది.

'సామీ! మా పిల్లగాన్నిట్లా పంపుదూ!' అని చాలా వినయంగా విన్నవించుకుంది.

నేను తల ఊపిన తరవాత పాపయ్య లేచాడు. ఇరుపక్షాలూ నన్ను గుర్తించినందుకు సంతృప్తి కలిగింది. ఆ సంతృప్తి కూడా నా భ్రమ అని ఆ తరవాత తెలుసుకున్నాను. మొదటికీ, ఇప్పటికీ తేడా ఏమిటి? అప్పుడు నన్నడగ లేదు. ఇప్పుడు అడుగుతూంది. ఎట్లా రావడం తప్పనప్పుడు, నేను అనుమతి ఇవ్వడం తప్పనప్పుడు ఈ తతంగం మాత్రమెందుకు? ఆమెకూ, నాకూ అనవసర శ్రమ. అదీకాక, అధ్యాపకు లున్నప్పుడు ఈ అడగడం అదీ లేకుండా జరుపుకుపోతూంది గదా? వాళ్ళ నడిగే అలవాటు న్నట్లయితే, నన్నూ మొదటే అడిగేది. ఇట్లా ఆలోచిస్తున్నప్పుడు ఇతర ఉపాధ్యాయులు పట్టించుకోని క్రమశిక్షణ నే నొకణ్ణే పాటించానన్న గర్వం కరిగిపోయింది. వాళ్ళకూ ఇది అనవసర ఆయాసంగా కనిపించి మానుకుని ఉండవచ్చు గదా! నా అధికారాన్ని మెలమెల్లగా మళ్ళీ సంకోచించుకున్నాను. ఆమె క్రమక్రమంగా తిరిగి వ్యాకోచం చెందింది.

బుజ్జమ్మ జీవితంతో ఇంత మాత్ర పరిచయంతో కొంత కాలం జరిగింది. ఒకరోజు బాగా ఆకలేసి, ఇంటికి చేరుకున్న రోజున చింత చిగురు వేసిన పప్పూ, అన్నమూ తిన్నాను. బ్రహ్మాండంగా ఉందనిపించింది. ఆ తరవాత, చింతచిగురు పప్పు తరుచూ కనిపించేది. చింతచిగురు పప్పు నా కిష్టమే. కృష్ణదేవరాయలకే అదిగొప్ప 'టేస్ట్'గా కనిపించింది. అయితే మాత్రం, రోజూ తినే ఉంటే ఆయన ఆ పప్పుమీద పద్యం అల్లకపోవును.

'ఏం చేసేది? ఆ బుజ్జమ్మ రోజూ పడేసి పోతుంది. అక్కడికీ కొంత ఆకు ఎండ పెడుతున్నాను, పొడి గొడదామని.'

'బాగుంది, బుజ్జమ్మ బుజ్జగించి కొనిపిస్తోందా? బెదిరించి కొనిపిస్తోందా?'

'కొనడమెక్కడ? మొదట చారెడు నూకలు పొయ్యడమేమో అంతే, పాపం! చింతాకుపప్పు అయ్యగారి కిష్టమన్నాను, ఇకంతే. పోస్తోంది, వద్దన్నా వినదు. దీనితో బుజ్జమ్మ జీవితంలో ఇంకొంచెం ఎక్కువ భాగం పరిచయమైంది. ఆమె భర్త రైతులకు సేద్యం పనులకు పోతూ ఉంటాడు.

వాళ్ళు గింజలో, డబ్బో ఇస్తే అట్లానే సారాకొట్టు దగ్గరికి పోతాడు. ఆమె రైతుల ఇళ్ళ దగ్గర ధాన్యం దంచీ విసిరీ, గొడ్ల దగ్గర పేడా రోచ్చూ ఎత్తీ తననూ, కొడుకునూ బతికించుకుంటూంది. పొలాల్లో ఆడవాళ్ళు చేసే పనులూ, మగవాళ్ళూ చేసే పనులూ చేస్తుంది. ఇంకా అప్పుడప్పుడూ పెట్టుబడి అవసరం లేని చిన్న వ్యాపారంకూడా చేస్తుంది. అందులో ముఖ్యంగా వర్షాకాలంలో, పొలం పని తక్కువగా ఉండే రోజుల్లో ఊరికి దూరంగా ఉన్న చింతతోపులో చింతాకు కోసుకొచ్చి అమ్ముకోవడ మొకటి.

ఎందుకామె, నా కిష్టమని కష్టపడి కోసుకొచ్చిన చింతాకు ఉచితంగా పోసి పోతూంది? నేను మంచివానిలాగా కనిపించి ఉంటానా? లేక మంచి టీచర్‌నని కొడుకు ద్వారా విని ఉంటుందా? 'మా వాడికి పయ్యేటు సెప్పు, సామీ. నా శకితికొడికీ ఇచ్చుకుంటాను' అని ఒకనాడు అడిగేదాకా అట్లానే అనుకున్నాను. చింతాకు పోసి, ప్రైవేటు చెప్పించా లనుకుందా? కోపమొచ్చింది. నా కోపంలో అర్థం వేరే ఉండవచ్చు. ఆమె కోరిక పెట్టుకుని, అట్లా చేస్తూందని తెలిశాక నన్ను గురించిన నా అభిప్రాయం నా కల్పితమే నని గ్రహించడానికి చీకాకు పడి ఉండవచ్చు. ఆ అల్పత్వమే చింతాకూ ప్రైవేటు చెప్పడానికీ అనల్పమైన తేడా ఉందని ఊహిస్తూంది. ఏముంది తేడా? ప్రైవేటు చెప్పడంలో నా శ్రమ ఉంది, చింతాకు నాకు చేరడంలో ఆమె శ్రమ ఉంది. నా అహంకారమూ, ఆమె వినయమూ తప్ప తేడా లేదు. ఒకసారి అవకాశవశాత్తూ అడిగినందున, ఇంక అనుమానం దేని కనుకుందేమో? రెండో సారి సావకాశంగా అడిగింది. నేను నవ్వి ఊరుకున్నాను. నీ కొడుకును దూరంగా చూస్తుంటేనే అసహ్యం, దగ్గరకు కూర్చోపెట్టుకుని చదువెలా చెప్పేది అని ఎలా చెప్పేది?

పాపయ్య క్లాసులో కనిపించని కారణం అడిగి అడగక ముందే జరిగిన సంఘటన పిల్లల వల్ల విని దిగ్భ్రాంతి చెందాను. బుజ్జమ్మ చింతచెట్టు చిటారుకొమ్మల్నించీ పడి, తల పగిలి దారుణంగా చనిపోయిందట. ఇంట్లోకూడా ఇదే వార్త విన్నాను. ఊళ్ళో అంతా వెళ్ళి చూసి వచ్చి, చూడని వాళ్ళకు చెబుతున్నారు. ఆ రోజు ఇద్దరమూ ఆమెను గురించే విషాదంగా మాటాడుకున్నాము. రెండు మూడు రోజులు జరిగి, విషాదం తగ్గిన తరవాత బుజ్జమ్మ చావును గురించి జనం వింతగా చెప్పుకున్నారు ఆ చెంగమ్మ బావి దగ్గర చింతచెట్టు మీద దయ్యముందట, ఆ సంగతి తెలిసినా వినకుండా బుజ్జమ్మ మొండిగా ఆ చెట్టె ఎక్కేదట! ఆ రోజు చిటారు కొమ్మల్లో ఉన్న బుజ్జమ్మను దయ్యం తోసేసిందట. బుజ్జమ్మ పై నించీ జారుతూ, దొరికిన కొమ్మ అందుకోబోతే దయ్యం అదీ తప్పించిందట! ఇంకో వారంలో ఇంకో వింత. ఈ సారి బుజ్జమ్మే దయ్యమై, ఇద్దరు ముగ్గురికి కనిపించిందట. పాత దయ్యం సంగతి విడిచి ఇప్పుడు కొత్త దయ్యం సంగతి చెప్పుకుంటున్నారు.

• • •

పటపట నా మీద చినుకులు రాలేప్పటికి గమనించి చూస్తే, చెంగమ్మ బావి చింతచెట్టుకు సగం దూరంలో దారిలో నిలుచునిపోయాను.

ఈ దారిన రాత్రివేళ ఇంతకు ముందొచ్చినాను. అప్పుడే సందేహం లేదు. అప్పటికేదో దయ్య ముందనుకోవడం విన్నదే! అయినా, లెక్కపెట్టలేదు. ఇప్పుడు బుజ్జమ్మ నాకు తెలుసు, ఆ పాత దయ్యం నాకు తెలియదు. అదే కారణమా? అందుకే ఇక్కడ నిలుచునిపోయానా? ఛీ ఛీ! సిగ్గు! ముందటికంటే వడిగా ముందుకు నడిచాను. ఇంత వడిగా ఎందుకు నడుస్తున్నాను? చింతచెట్టు వైపే చూడకుండా ఉండాలని ఎందుకు ప్రయత్నిస్తున్నాను? 'చీకట్లో ఆ దారిని రాకండి' అని నా భార్య చెప్పినప్పుడు నవ్విన నేను, ఆ మాటే ఎందుకు వింటున్నాను? తలఎత్తి చెట్టుకేసి సూటిగా చూశాను. చెట్టు కదులుతూన్నట్టు తెలియకుండా చీకట్లో మునిగి ఉంది. అది చింతచెట్టు. అంతే! అయితే అది 'సామీ! మా అబ్బిగాని పయ్యేటు సంగతి యేం జేసినావు?' అనడుగుతూన్నట్లు అనిపిస్తూంది. ఒక్కసారి తళుక్కుమని మెరిసింది. ఆ మెరుపు వెలుగులో అనుకోకుండానే చింత చెట్టు కేసి చూశాను. ఒళ్ళు జల్లుమంది. దయ్యం! అయితే, బుజ్జమ్మలాగా లేదు. పిల్లవాడి లాగా ఉంది. చెట్టు మొదలు కానుకుని కూర్చున్నట్లుగా ఉంది. దయ్యం తన ఇష్టమొచ్చిన ఆకారంలో కనిపిస్తుందంటారు. కాళ్ళు వణుకుతున్నాయి నాకు. తప్పకుండా దయ్యమే! కాకపోతే ఈ రాత్రి, ఇట్లాంటి సమయంలో మనుషుల పిల్లవా డెవడుంటాడు? పరుగెడదామనుకున్నాను. పరుగెడితే, దయ్యం గమనించి వెంట పడుతుందేమో? నిశ్శబ్దంగా దాటుకుని తరవాత పరుగెత్తవచ్చు. ఏడుపు లాంటి మూలుగు వినిపించింది. నా గుండె ఆగిపోతుందేమో ననిపించింది. ఈసారి పూర్తిగా, మాటగా, 'అమ్మా! అమ్మా!'

కొంచెం ఆగి విన్నాను. అదే వినిపిస్తూంది. ఆకాశం కేసి చూశాను. విశాలమైన పొలాల కేసి చూశాను. చెట్టు కేసి చూశాను. ఎందుకనో నా బెదురు అర్థం లేనిదనిపించింది. ఈ ప్రకృతిలో, ఈ పరిసరాల్లో ఏదికూడా నన్ను భయపెట్టాలన్న ఉద్దేశంతో లేవనీ, పైగా నేను భయపడుతున్నందుకు జాలి పడుతున్నాయనీ అనిపించింది. కుంచించుకుని పోయే నన్ను, నిటారుగా నిలబెట్టుకున్నాను. నా ధైర్యానికి నేనే ఆశ్చర్యపడుతూ, నన్ను నేనే అభినందించుకుంటూ చెట్టు కేసి నడిచాను. వెంట వెంటనే కళ్ళార్పినట్లుగా మెరుపులు.

'పాపయ్యా!' ప్రకృతి ధ్వనించింది.

లేచి నిలుచున్నాడు.

'ఈ వేళప్పుడు, ఇక్కడ. . .' నాకు ఉద్వేగంతో మాట రాలేదు. వాడు ఏడుపు అందుకున్నాడు. వీపున చెయ్యేసి రాస్తున్నాను. మెల్లిగా నా కాన్చుకుని దారిలోకి నడిపిస్తున్నాను. నా చేతి కింద వాని శరీరం ఎగసి పడుతూంది వెక్కిళ్ళతో. అయిదు నిమిషాల తరవాత 'భయమేసిందా?' అన్నాను. లేదన్నట్లు తల ఊపాడు. తల ఊపినట్లు నా చేతి చుట్టులో కదలిక తెలిసింది. 'మరి . . . మరి. . .' అని నవ్వి, 'ఏడుస్తున్నా వెందుకు?' అన్నాను. నాకు నవ్వు రాలేదు. వాని భారం దించడానికి బలవంతంగా తెచ్చుకున్నాను. దయ్యం కనిపించిందా? అని అడిగేదా? మీ యమ్మ కనిపించిందా? అనడిగేదా? వద్దు. అట్లా అడగకూడదు.

'ఎంత సేపయింది ఇక్కడి కొచ్చి?'

'పొద్దుగూకుతూనే.'

'అరె, అప్పు డెందు కొచ్చినావు?' పలకలేదు.

'పగలు రాకూడదా?' అన్నాను.

వెక్కిళ్ళ మధ్య చాలా తొందరగా మాట్లాడాడు, వాడి మనసులో దుఃఖం తీవ్రంగా తన్నుకొస్తూంది.

'ఇంతకుముందు రెండుసార్లు వచ్చినాను, మల్లన్న అన్నాడు, రాత్రిళ్ళనే కనిపిస్తుందంట. . .'

నా కేదో అర్థమౌతూంది. వాని చుట్టూ చేతులు బిగుసుకుంటున్నాయి.

'ఎంత సేపు కూచున్నా కనిపించలా. మా అమ్మ కనిపించలా. మా అమ్మ దయ్యం కాలేదు—పట్టేది.' కసిగా అరిచాడు.

ఏడుపు ఊపుకి ఊగిపోతున్నాడు.

'మా అమ్మ. . .' ఈ సారి మాట పూర్తి చెయ్యనీకుండా హత్తుకున్నాను.

నా గుండెల మీద వాని కన్నీటిధార! వాని పెద్ద తల మీద ఒకటి, రెండు నా కన్నీటి చుక్కలు! ★

## రాయలసీమ రచయితల సభలు

మార్చి 8, 9 తేదీలలో అనంతపురంలో రాయలసీమ రచయితల సభలు జరిగాయి. శ్రీ గడియారం వెంకటశేషశాస్త్రి సభలను ప్రారంభిస్తూ రాయలసీమ రచయితల సాహిత్య వికాసాన్ని ప్రశంసించారు. శ్రీ సి. వి. సుబ్బన్న అష్టావధానం చేశారు. సాహిత్యసభకు శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం అధ్యక్షత వహించి ప్రాచీన, ఆధునిక సాహిత్యాల మేలిపొలగులను అభివర్ణించారు. జె. హేమలత మార్గ రచనలు గూర్చి, వి. రామచంద్రరావు దేశిరచనలు గూర్చి ముచ్చటించారు. మధురాంతకం రాజారాం, బి. లక్ష్మీకాంతం కథలను గురించి మాట్లాడారు.

రెండవ రోజు శ్రీ సి. వి. సుబ్బన్న అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి, కేతు బుచ్చిరెడ్డి, బి. మంగమ్మ, మీసరగండ పుల్లమరాజు, బి. శ్రీనివాసరావు, పి. రమేష్‌నారాయణ, ఎ. మంజునాథ్ స్వీయకవితలు చదివారు. శ్రీ వెంకటశేష శాస్త్రిగారి అధ్యక్షతన 'సమాజము—రచయితలు' అనే అంశంపై ప్రసంగాలు జరిగాయి. అనంతపుర మండలి కవుల చరిత్ర ఆవిష్కరణ జరిగింది. ★